భీమయ్యక్ జాతరకు వేళాయె

- కొలాంల కొంగు బంగారం భీమన్న దేవర
- నేటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు
- భారీ సంఖ్యలో హాజరుకానున్న ఆదివాసీలు


భీమన్న దేవర

తిర్యాణి: ఆదివాసీ తెగ కొలాంల కొంగుబంగారం భీమన్న దేవర జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మండలంలోని దంతన్‌పల్లిలో కొలువైన భీమా అయ్యక్ (భీమన్న దేవర)కు కొన్నేళ్లుగా కొలాంలు సంప్రదాయబద్ధంగా పూజలు చేస్తున్నారు. ఏటా జనవరిలో మూడు రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి దేవుడిని పూజిస్తే తాము అనుకున్న కార్యాలన్నీ నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా ఈ ఆలయానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది.

దట్టమైన అడవిలో..

మండలంలోని దంతన్‌పల్లి గ్రామ సమీపంలో గల దట్టమైన అటవీ ప్రాంతంలో భీమన్న దేవర వెలిశాడు. ఈ ఆలయం చుట్టూ అగ్నిదేవుడు, మైసమ్మ, పోచమ్మ వంటి గ్రామ దేవతలు సైతం వెలిశాయి. మండల కేంద్రం నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. కాగా ఆత్రం వంశీయులు ఏన్నో ఏళ్ల నుంచి ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇదే వంశానికి చెందిన కొట్నాక, పెందూర్, గెడం, తొడసం, ఉర్వేత, కోర్కేట, ఉయిక, మరప, సలాం, కుడిమెత అనే తెగలకు చెందిన పూజారులు ఏటా ఇక్కడ మూడు రోజుల పాటు విడిది చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ నిర్వహించే జాతరకు ఉమ్మడి జిల్లాలోని కొలాంలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదివాసీలు తరలివస్తారు. కాగా ఈ ఏడాది జాతరను ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఆదివాసీ కళాకారులు మహాభారతం, పంచపాండవుల కథలను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసింది.

మూడు రోజులపాటు జాతర..

మూడు రోజుల పాటు జరిగే జాతరలో అనేక సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. మొదటి రోజు గురువారం దేవస్థానంలోని దేవుని వన ప్రవేశం చేపట్టి, ఆదివాసీలకు చెందిన ఇతర దేవుళ్లను కలుసుకొని, తిరిగి ఇతర దేవుళ్లతో కలిసి భీమన్న దేవుని ఆలయ ప్రవేశం చేస్తారు. అనంతరం భేటి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కొత్త దంపతులు మట్టితో దేవుని ప్రతిరూపాలు తయారు చేసి వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆత్రం వంశానికి చెందిన పెద్దలకు కొత్త కోడళ్లను పరిచయం చేస్తారు. అప్పటి నుంచి వారిని ఆత్రం వంశ కోడళ్లుగా గుర్తిస్తారు. రెండోరోజు శుక్రవారం దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం జాతరతో పాటు దర్బార్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం దేవుళ్ల వన ప్రవేశం చేపడుతారు. మూడో రోజు శనివారం ఆలయంలోని అమ్మ వారికి (పోచమ్మ) ప్రత్యేక పూజలు చేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఈనెల 18 నుంచి 20 వరకు దంతన్‌పల్లిలో జరిగే భీమన్న జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. జాతర నిర్వహించే మూడు రోజులు అన్నదానం నిర్వహిస్తాం. జాతరకు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు.

– ఆత్రం గంగారాం, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి పతకాలు సాధించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శిశుమందిర్ పాఠశాల మైదానంలో గత ఆరు రోజులుగా రాయల్ రంబల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించి, శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొనగా ఈజ్‌గాంకు చెందిన గోకుల్ లెవెన్ జట్టు మొదటి బహుమతి రూ. 30వేల నగదు, కాగజ్‌నగర్‌కు చెందిన జాక్ వారియర్స్ జట్టుకు ద్వితీయ బహుమతి రూ. 20 వేల నగదు అందజేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అర్షద్ హుస్సేన్, నాయకులు జాడి శ్యామ్ రావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


బహుమతులు అందజేస్తున్న సీఐ, నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని సీఐ సాధిక్‌పాషా అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా టోర్నిలో 60కిలోల విభాగంలో గెలుపొందిన మొగడ్‌దగడ్ జట్టుకు ప్రథమ బహుమతి రూ. 21 వేల నగదు, రన్నర్‌ప్‌గా నిలిచిన ఈజ్‌గాం జట్టుకు రూ. 11వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వీర్దండి జట్టుకు రూ.5వేల నగదుతో పాటు బహుమతులు అందించారు. 54కిలోల విభాగంలో మహారాష్ట్రలోని వెడ్‌గావ్ జట్టు ప్రథమ బహుమతి, టోంకిని జట్టు రెండో బహుమతి, తాటిపల్లి జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఎర్రంచులు ఉర్వత్ జీజాబాయి, ఆదే శ్రీనివాస్, ఎంపీటీసీలు మనీశ్, ఉపసర్పంచ్ కల్పన, బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, కార్యదర్శి శ్రావణి, మహేశ్, రుషి, కలీంపాష, శ్రావణ్, మారుతి, గోవింద్‌రావు, రాజ్‌కుమార్, సుధాకర్, పీఈటీలు సంతోష్‌నాయక్, హరీశ్, ఓంకార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంఎండీపీ కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న సుధాకర్ నాయక్

రెబ్బెన: మండలంలోని కొండపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం బోదకాలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు 50 ఎంఎండీపీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ మాట్లాడుతూ బోదకాలు, కుష్టు వ్యాధిగ్రస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అందుకు ఎంఎండీపీ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోదకాలు, కుష్టు వ్యాధి నిర్మూలనకు వైద్యశాఖ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరికి ఈ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండపల్లి సర్పంచ్ వడాయి శాంత, పంచాయతీ కార్యదర్శి అజార్‌అలీ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రవీణ్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం, ఇందాని గ్రామ శివారుల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. కనర్‌గాంలో పేకాట ఆడుతున్న నలుగురితో పాటు రూ.1300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందానిలో 8 మందితో పాటు రూ.8710 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. పేకాట, దేశీదారు, గుడుంబా విక్రయాలు వంటి అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివాజీ జయంతి అధికారికంగా నిర్వహించాలి

కౌటాల: ఛత్రపతి శివాజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆరెకుల సంఘం మండల అధ్యక్షుడు చన్కపురె శంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 19న శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయంలో బుధవారం ఆర్‌డీవో కాసబోయిన సురేశ్ సీఐటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఏవో ప్రమోద్‌కుమార్, సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూమిని కాపాడాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: అడ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ లైన్ నంబర్ 25ను నిర్మించేందుకు ప్రభుత్వం సేకరించిన భూమి అన్యాక్రాంతమైందని జాగృతి యువ మంచ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అష్రఫ్ ఆరోపించారు. భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం కాగజ్‌నగర్ ఆర్‌డీవో కాసబోయిన సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రూ. కోటి 51లక్షల16వేలు చెల్లించి 29 ఎకరాల 13 గుంటల 8 సెంట్ల భూమిని ప్రభుత్వం గతంలో కొనుగోలు చేసిందని, ప్రస్తుతం ఆ భూమి అన్యాక్రాంతమైందన్నారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) హాజీపూర్ మండల నూతన కమిటీని బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎల్కటూరి రాజేశ్, ఉపాధ్యక్షుడిగా ఎల్కటూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మల్యాల తిరుపతి, ప్రచార కార్యదర్శిగా అడ్లూరి వంశీ, కోశాధికారిగా మల్యాల నర్సయ్య, మండల కో కన్వీనర్‌గా తాళ్లపల్లి అంజి, గౌరవ అధ్యక్షుడిగా సీపెల్లి మొగిళి ఎంపికయ్యారు.

కొత్త మామిడిపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో మోదీ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రచార రథంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, నోడల్ అధికారి అనిల్, సర్పంచ్ రాజయ్య, ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ సిబ్బంది నాగరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కాసిపేట: మండలంలోని కోమటిచేను, పల్లంగూడ, బుగ్గగూడ గ్రామపంచాయతీల్లోని నర్సరీలను బుధవారం ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వహణలో అశ్రద్ధ చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీలలోని మొక్కలతో పాటు రోడ్డుపక్కన నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు.

డ్రైవర్ల వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న డ్రైవర్ యూనియన్ నాయకులు

జైనూర్: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలో డ్రైవర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలో డ్రైవర్లు నిర్వహిస్తున్న ధర్నాకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఆయా సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

శ్రీరాములోరి అక్షింతలతో శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


నినాదాలు చేస్తున్న హిందూవాహిని సభ్యులు

జైనూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు తొలిసారిగా శ్రీరామ దీక్ష మాలధారణ చేపట్టారు. భక్తులు ఎంతో ఉత్సాహంగా ఈ నెల 22న జరిగే శ్రీ రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని గ్రామాల్లో సుందరకాండ పారాయణం, భజనలు, ఉపవాస దీక్షలు చేపడుతున్నట్లు ఆలయ పూజారి కాంబ్లే దర్మపాల్ అన్నారు. సర్పంచ్ రాథోడ్ రాందాస్, నాయకులు, భక్తులు తదితరులు ఉన్నారు.

గోడలపై శ్రీరామ నామం ప్రచురణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామాలయం ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో హిందూవాహిని సభ్యుడు కిరణ్ నేతృత్వంలో ప్రతి ఇంటి గోడపై శ్రీరామ నామాన్ని ప్రచురించారు. కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. నామమాత్రం!

- ఆగని ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- ప్రచారంతోనే సరి.. కరువైన పర్యవేక్షణ


కౌటాలలోని వైన్స్‌ల సమీపంలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు

కౌటాల: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పాలిథిన్ కవర్ల వినియోగం జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు మాత్రం రావడం లేదు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల కారణంగా డ్రెయినేజీలు మూసుకుపోయి వరద సమస్యలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్‌ను కాల్చేయడం వల్ల కర్బన ఉద్గారాలు పెరిగి వాతావరణ కాలుష్యం పెరుగుతోంది.

ఆగని వినియోగం..

పాలిథిన్ కవర్ల వాడకంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. కానీ అమలు మాత్రం జరగడం లేదు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సేకరిస్తున్న చెత్తలో అధిక శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. నిషేధం ఉన్నా చెత్త కుప్పల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో అధికారులకే తెలియాలి. పేపర్ బ్యాగులను భూమిలో త్వరగా కలిసిపోయే పదార్థాలతో తయారు చేస్తారు. మూడు నెలల్లో భూమిలో కలిసిపోయి మొక్కలకు ఎరువుగా మారుతాయి. వాటివల్ల పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదు. అధికారులు ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార, కాగితం ఉత్పత్తుల వాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిబంధనల ఉల్లంఘన

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీరని ముప్పు పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. చెత్తకుప్పల నిండా ప్లాస్టిక్ కవర్లు ఉండడం పర్యావరణ ప్రేమికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. ప్లాస్టిక్ కవర్లు, ఇతరాత్ర నిషేధిత వస్తువులను వినియోగించడం వల్ల భయంకరమైన క్యాన్సర్ వ్యాధితో పాటు ఇతర అనేక రకాల అనారోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ వాడకం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. భూమి సారాన్ని కోల్పోతుంది. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నా పలువురు వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లలోనే సామగ్రిని విక్రయిస్తున్నారు. అధికారులు తరుచూ దుకాణాల్లో తనిఖీలు చేస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

పాలిథిన్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలి. గ్రామాల్లో వీటివల్ల కలిగే అనర్థాలపై వివరించాలి. పేపర్ బ్యాగులను వినియోగించాలి.

– సునీల్, గుడ్లబోరి

జరిమానా విధిస్తాం

ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుంది. ఇటీవల కౌటాలలో వైన్స్‌లకు జరిమానాలు విధించాం. అన్ని దుకాణాల్లో తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధిస్తాం. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

– ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

కాగజ్‌నగర్‌రూరల్: మానవుల అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత అని సీడీపీవో సురేఖ అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా- నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీరోజు ఎంతోమంది యువతులు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బాలరామకృష్ణ మాట్లాడుతూ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా తమ సంస్థ ఆధ్వర్యంలో గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో 28,200 మంది మహిళలను కాపాడి పునరావాసం కల్పించామని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్, కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు. లఘు చిత్రాల ద్వారా అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అంబేర్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమాచారం

నేడు సమావేశం

పెంచికల్‌పేట్: ఈనెల 25వ తేదిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో గురువారం మధ్యాహ్నం 2గంటలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్: మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లులలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిన్నింగ్ మిల్లులలో పత్తి నిల్వలు ఎక్కువగా ఉండటంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 22న తిరిగి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని గురువారం ప్రారంభించేందుకు సర్పంచ్ సంజీవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు ఆలయంలో నవగ్రహాల పూజ, అష్టదిగ్బంధనం చేశారు. దేవతా మూర్తుల విగ్రహాలకు అర్చకులు అశోక్‌చారి, దేవర వినోద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం ప్రతిష్టాపన కార్యక్రమం, బోనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు మహాపాదయాత్ర

బెజ్జూర్: మండలంలోని ఎల్కపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మహారాష్ట్రలోని చప్రాడ శ్రీకార్తీక మహరాజ్ ఆలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 5గంటలకు ప్రారంభమయ్యే మహాపాదయాత్ర బెజ్జూర్, బారెగూడ, రుద్రపూర్, మానెపల్లి, రవీంద్రనగర్, బాబాపూర్, తుమ్మిడిహెటి మీదుగా చప్రాడకు రాత్రి వరకు చేరుకోనుంది. పాదయాత్రకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

రాముడి పాదుకలతో గూడెంలో పూజలు

దండేపల్లి: అయోధ్యలో పూజించబడి, కొండగట్టుకు తీసుకెళ్తున్న శ్రీరాముడి పాదుకలు బుధవారం దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చేరుకున్నాయి. దీంతో పాదుకలను తీసుకొస్తున్న భక్తులు, వాటితో గూడెం గుట్టపై గల శ్రీసత్య నారాయణస్వామిని దర్శించుకున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెడల్పు పనులను బుధవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పాతమంచిర్యాల నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా తోళ్లవాగు వరకు రోడ్డు వెడల్పు పనులను రూ.12.39కోట్లతో ప్రారంభించినట్లు, ప్రస్తుతం ఆయా పనులను పూర్తి చేస్తున్నారన్నారు.

అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్

కెరమెరి: ఈ నెల 31 లోపు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య అనుకున్న స్థాయిలో పెరగడం లేదన్నారు. ప్రతీ జీపీలో 50 మందికి తగ్గకుండా కూలీల సంఖ్య ఉండాలని, పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 23 గ్రామాల్లో ఉన్న పీవీటీజీ (ఆదిమ గిరిజనుల) సర్వేను ఈ నెల 31 వరకు పూర్తి చేయాలన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య సిబ్బంది ఉన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

కౌటాల: సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ ఈవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 –25 సంవత్సరానికి గాను నిర్వహించే అభివృద్ధి పనులపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని గుండి వంతెన నిర్మాణం పనులను పరిశీలించారు. వంతెన నిర్మాణం వానాకాలంలోపు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దత్తు, నాయకులు భీమేశ్, పెంటు తదితరులు పాల్గొన్నారు.